


పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు గుత్త హరినాయుడు , డాక్టర్ వెంకటరామయ్య తెలిపారు.స్థానిక అన్నమయ్య సర్కిల్లో వున్న తిరుపతి గ్రేడ్– 1 గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్ అధ్యక్షతన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు, విద్యార్థిని విధ్యార్థులతో ఘనంగా నిర్వహించారు. రాసాని వెంకటరమణయ్య, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ఇంపాక్ట్ క్లబ్ రీజనల్ ప్రెసిడెంట్ తహసున్నిస బేగం మాట్లాడుతూ పుస్తక పాఠనంతోనే మెరుగైన భవిత సాధ్యమన్నారు. కవులు రచయితలు అనధికారిక శాసన కర్తలన్నారు. గ్రంథాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాలు మంచి ఆలోచనలు పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. యువశక్తిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్. వి. యస్. యస్. శర్మ, ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు ఆరవ జైపాల్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో మూడంచెల వ్యవస్థ ఏర్పాటు

పటిష్ట పర్యవేక్షణ సేవలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ప్రభుత్వ విభాగాల సేవలను ప్రజల వద్దకు మరింత పటిష్ట పర్యవేక్షణ, వేగవంతంగా చేరవేసేందుకు గ్రామ సచివాలయాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా " త్రీటైర్ స్ట్రక్చర్ " ను త్వరలో తీసుకురానుందని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు.

త్రీటైర్ స్ట్రక్చర్ అమలు ఇలా.....

ప్రభుత్వ సేవలను ప్రజలకు నేరుగా అందించేందుకు ఇప్పటికే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 పైచిలుకు ప్రభుత్వ సేవలను అరచేతిలోకి తీసుకువచ్చింది. స్మార్ట్ ఫోన్ల ద్వారా ఇంటిలో కూర్చునే ప్రభుత్వ సేవలను పొందే విధంగా డిజిటల్ గవర్నెన్స్ బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆలోచనలను చేసి అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామ వార్డు సచివాలయాల విభాగం మరింత పటిష్టంగా, సమగ్ర పర్యవేక్షణలో ఉండాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు భావించారు. నూతనంగా అమలు కానున్న త్రీటైర్ స్ట్రక్చర్ లో 1.సచివాలయం, 2.మండలం లేదా మున్సిపాలిటీ లేదా మునిసిపల్ కార్పొరేషన్ 3. జిల్లా వ్యవస్థగా విభజించింది. గతంలో ఎంపీడీవోలతో నడిచిన జిఎస్ డబ్ల్యూఎస్ విభాగం మండల జిఎస్ డబ్ల్యూఎస్ అధికారి పర్యవేక్షణలో ఇకపై నడవనుంది.

తిరుపతి జిల్లాలో....

త్రీటైర్ స్ట్రక్చర్ ద్వారా తిరుపతి జిల్లా పరిధిలోని ఏడు మునిసిపాలిటీలు, 33 మండలాలకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పజెప్పనున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ లో అదనపు కమిషనర్ స్థాయి అధికారి త్రీటైర్ స్ట్రక్చర్ లో జిఎస్ డబ్ల్యూఎస్ విభాగ పర్యవేక్షణ చేస్తారు. గ్రేడ్ 1 లో ఉన్న గూడూరు, శ్రీకాళహస్తి అండ్ గ్రేడ్ 2 వెంకటగిరి మున్సిపాలిటీలలో మేనేజర్ స్థాయి అధికారి జిఎస్ డబ్ల్యూఎస్ పర్యవేక్షణ చేస్తారు. ఇక గ్రేడ్ 3 మున్సిపాలిటీలుగా ఉన్న సూళ్లూరుపేట, నాయుడుపేట, పుత్తూరు మున్సిపల్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ అధికారి జిఎస్ డబ్ల్యూఎస్ విభాగ బాధ్యతను పర్యవేక్షణ చేయనున్నారు.



పటిష్ట పర్యవేక్షణలో పౌర సేవలు.....


రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వస్తున్న ఈ త్రీటైర్ స్ట్రక్చర్ పరిపాలన ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను పటిష్టంగా అమలు చేయనున్నారు. తిరుపతి జిల్లాలోని 691 సచివాలయాలలో 5554 మంది సచివాలయ సిబ్బంది వివిధ విభాగాలకు సంబంధించి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించే బాధ్యతను త్రీటైర్ స్ట్రక్చర్ అమలులో భాగంగా ప్రజల ముంగిటకే సులువైన సేవలను ప్రభుత్వం అందించనుంది.

పారదర్శక విధానానికి ఇది నిదర్శనం....



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గ్రామ వార్డు సచివాలయాలలో ప్రవేశపెట్టనున్న త్రీటైర్ స్ట్రక్చర్ ద్వారా ప్రజలకు సులభతరమైన సేవలను, వేగవంతంగా సమగ్ర పర్యవేక్షణలో అందించడానికి ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుంది. గతంలో ప్రభుత్వ విభాగాలకు సంబంధించి పౌరులు ఏదైనా సేవలు అందుకోవాలని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి ఉండేది. ఇప్పుడు మనమిత్ర వాట్సాప్ గవర్నమెంట్ ద్వారా డిజిటల్ గవర్నెన్స్ ను బలోపేతం చేస్తూ ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చింది.

- జి.వి.నారాయణరెడ్డి, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి, తిరుపతి జిల్లా.



రాష్ట్రపతి ముర్ముకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

తిరుమలలో భక్తులతో రాష్ట్రపతి మమేకం

ప్రజాశక్తి -తిరుమల

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొదట క్షేత్రాధిపతి వరాహస్వామిని రాష్ట్రపతి ముర్ము దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు వచ్చారు. మహాద్వారం వద్ద రాష్ట్రపతికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు స్వాగతం పలికారు. ధ్వజస్తంభాన్ని దర్శించుకున్న తర్వాత రాష్ట్రపతి ముర్ము శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో రాష్ట్రపతికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. రాష్ట్రపతికి ఛైర్మన్ బీఆర్ నాయుడు శ్రీవారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను, టీటీడీ 2026 క్యాలెండర్, డైరీలను అందజేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమలలో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. శ్రీవారి దర్శనానంతరం పద్మావతి అతిథి గహానికి

చాక్లెట్లు పంచిన ద్రౌపది ముర్ము

తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాంభగీచ బస్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన నిల్చున్న భక్తులను పలకరించారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ప్రజలతో మమేకమయ్యారు. తన కాన్వాయ్ ఆపి మరి అక్కడ ఉన్న వారిని కలిశారు. అనంతరం శ్రీవారి భక్తులకు రాష్ట్రపతి చాక్లెట్లను పంచారు. ఆలయం వెలుపల మీతో ఫొటో దిగుతామంటూ టీటీటీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కోరగా రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి రామనారాయణరెడ్డితోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్రపతితో కలిసి ఫొటో దిగారు. సమీపంలోనే ఉన్న ఈవో సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్‌లను రాష్ట్రపతి పిలవడంతో వారూ వచ్చి ఫొటో తీయించుకున్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో పదివేల టిడ్కో ఇల్లు అసంపూర్తిగా ఉన్నాయి. వీటి నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని తిరుపతి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరు పట్టణాలలో పదివేల ఇల్లు నిర్మించి లబ్ధిదారులకు అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వైయస్సార్ పార్టీ వేసిన రంగులను మార్చి కిటికీలను, విద్యుత్తు, నీటి సౌకర్యాలను పూర్తి చేసి అందిస్తామని వాగ్దానం చేసి గొప్పగా ప్రకటనలు చేశారు. ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. డబ్బులు చెల్లించిన పేదలు ఒకవైపు బ్యాంకులకు వడ్డీలు చెల్లించలేక, తాము నివాసం ఉండే ఇళ్లకు బాడుగ చెల్లించలేక అప్పుల పాలవుతున్నారు. తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సంవత్సరం లోపు ఇళ్లను అందిస్తామని ప్రకటించినప్పటికీ దీనికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కొత్తగా మూడు సెంట్లు, రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చే పరిస్థితి లేదని, కనీసం నిర్మాణం పూర్తయి ప్రజలు నివసించడానికి చిన్న చిన్న పనులు పూర్తిచేస్తే ఉపయోగించుకునే పరిస్థితి ఉంటుందన్నారు.



ఎంఎల్ఎ ఆదిమూలంకు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్

వెత్తలతడుకు దళితులకు సాగుభూమి పట్టాలివ్వాలి

ప్రజాదర్బార్‌లో ఎంఎల్‌ఎకు వ్యకాసం వినతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

దశాబ్దాలుగా అనుభవంలో ఉన్న వెత్తలతడుకు దళితులకు సాగుభూమి పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ అన్నారు. నారాయణవనంలో సత్యవేడు ఎంఎల్ఎ ఆదిమూలం ఆధ్వర్యంలో శుక్రారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ వెత్తలతడుకు దళితుల భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సర్పంచి రామమూర్తి, గ్రామస్తులు రాజేష్, కాంతారావు, సొరకాయలు, ఏకాంబరం, కుమార్, మురళీక్రిష్ణ, చిన్నబ్బ, మునెయ్య, మునిశంకర్‌లు వినతిపత్రం ఇచ్చారు. కీళగరం రెవెన్యూలోని వెత్తలతడుకు దళితులకు 1975లో ఫారెస్టు సెటిల్మెంట్ అధికారి ఇచ్చిన ఉత్తర్వును కేవలం పెత్తందారులకు అమలు చేసి, దళితులకు అమలు చేయకుండా ఫారెస్టు వారు వివక్ష పాటిస్తున్నారన్నారు. ఫారెస్ట్ వారు జిల్లా కోర్టు నందు ఏఎస్ నంబర్ 148 / 1975 వేసిన అప్పీలును కోర్టు కొట్టి వేస్తూ 18- 2- 1985వ తేదీన కోర్టుఇచ్చిన తీర్పును కూడా ఫారెస్ట్ అధికారులు అమలు చేయలేదని ఆరోపించారు. 1992వ సంవత్సరంలో చిత్తూరు ఆర్డీవో 135 ఎకరాల భూమిని డిఫారెస్ట్ చేయమని నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఆ నోటిఫికేషన్ ఆధారంగా మండల సర్వేయర్ 270 నుంచి 278 వరకు అమలు చేస్తున్నట్టు చెక్ స్లిప్ చూపించారు. అయితే సర్వేనెంబర్ 277 వరకు మాత్రం అమలు చేశారు సర్వే నంబరు 278 అమలు చేయకుండా ఆపేశారు. ఈ సమస్యను పరిష్కరించమని గత 50 సంవత్సరాలుగా దళితులు జిల్లా కలెక్టర్, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి, ఆర్డీవో తాసిల్దారు, డిఎఫ్ఓ, రేంజర్లను పదేపదే అభ్యర్థించినప్పటికీ ఫలితం లేదని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని, ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలని జనార్ధన్ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ఈ భూములపై ఫారెస్ట్ డి ఎఫ్ ఓ తోను, జిల్లా కలెక్టర్ తోనూ మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మధురానగర్‌లో మానసిక రోగి విధ్వంసం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో మధురానగర్‌లో ఓ మానసిక రోగి విధ్వంసానికి పాల్పడ్డాడు. తాగిన మత్తులో తాను ఏం చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో, మధురానగర్ లోని ఒక కారుపై బండరాళ్లతో దాడికి పాల్పడి ధ్వంసం చేశారు. అనంతరం మూసివేసిన అంగళ్లు, ఇళ్లపై రాళ్ళ వర్షం కురిపించాడు. మంచి నిద్ర సమయంలో తెల్లవారుజామున జరుగుతున్న ఈ పరిణామాలకు ప్రజలు ఉలిక్కిపడి బయటకు వచ్చారు. జరుగుతున్నదేమిటో అర్థం గాక, మానసిక రోగిని నియంత్రించలేక చేష్టలుడిగి పోయారు. మధురానగర్‌లో నివాసం ఉన్న సిపిఎం నేత కందారపు మురళి జోక్యం చేసుకుని అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మానసిక రోగిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇతను తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన వ్యక్తిగా నిర్ధారణ అయింది. కుటుంబంలో జరిగిన కొన్ని పరిణామాల కారణంగా మానసికంగా దెబ్బతిని దాడులకు పాల్పడటం అలవాటైనట్టుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో మధురానగర్లో తన తల్లిదండ్రులను చూడ్డానికి వచ్చిన బెంగళూరుకు చెందిన రవికాంత్ అనే వ్యక్తికి చెందిన కారు ధ్వంసమైనట్టుగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఈ మానసిక రోగి అలిపిరి పోలీసుల అదుపులో ఉన్నారు.



మానసిక రోగి చేతిలో ధ్వంసమైన కారు



ఏపీలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ నిర్వహణ శభాష్

ప్రజాశక్తి - రామచంద్రాపురం

వాతావరణ సమాచారాన్ని స్వయంగా సేకరించి, ప్రసారం చేసే అధునాతన వ్యవస్థాయిన స్వయం చాలక వాతావరణ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కషి చేస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తానంద అగర్వాల్ తెలిపారు. శుక్రవారం తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలంలోని నడవలూరు, రామచంద్రాపురం గ్రామాలలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్, చేతితో కొలిచే వర్షపాత నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ ల ద్వారా వాతావరణ మార్పులను మారుమూల ప్రాంతాల నుండి డేటాను సేకరించి వాతావరణ సమాచారాన్ని ముందస్తుగా ప్రజలకు తెలియజేసి, అప్రమత్తంగా ఉండేటట్లు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. వాతావరణములోని పీడనం, ఉష్ణోగ్రత, తేమ, గాలి వేగం, గాలి దిశ, వర్షపాతం, సౌర వికిరణం, తుఫాన్లు, వర్షాలు, నేలలో తేమ వంటి అంశాలను కొలిచే స్వయం చాలక వాతావరణ కేంద్రాల ద్వారా తెలుసుకుని విపత్తుల నుండి బయటపడవచ్చన్నారు. కుండపోత వర్షం కురుస్తున్నప్పటికీ వర్షాన్ని లెక్కచేయకుండా ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లను, చేతితో కొలిచే వర్షపాత కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించి వాటి పనితీరు శభాష్ అని కితాబిచ్చారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ డి. వేణుగోపాల్, తిరుపతి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రాజశేఖర్, రామచంద్రాపురం అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రకళలతో సమావేశమై ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల పనితీరు, నిర్వహణ ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సుమలత, వీఆర్ఏ ఓరుగంటి మోహన్ పాల్గొన్నారు.

సీడీఎస్ఎల్ లో ఐడియాథాన్‌కు శ్రీకారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆసియాలోనే తొలి లిస్టెడ్ డిపాజిటరీ 16.7 కోట్ల డీమ్యాట్ ఖాతాలకు కస్టోడియన్‌గా వ్యవహరిస్తున్న సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్ఎల్), కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా, విద్యార్థుల కోసం వినూత్నంగా తొలి ఐడియాథాన్‌ను ఆవిష్కరించిందని ఆ సంస్థ సీఈవో నేహల్ వోరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిటరీ వ్యవస్థ 21 కోట్లకు పైగా ఇన్వెస్టర్ల డీమ్యాట్ ఖాతాల అసెట్స్‌ను సురక్షితంగా ఉంచుతోంది. సెక్యూరిటీస్ మార్కెట్ విస్తరణకు, ఇన్వెస్టర్లకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. వినూత్నతకు, సజనాత్మకతకు పట్టం కట్టే విధంగా ఐడియాథాన్ లో రూ. 11.5 లక్షల బహుమతులు ఉంటాయి. ఇందులో విజేతగా నిల్చే ఐడియాకు రూ.5 లక్షలు, రన్నర్స్ కు రూ. 3 లక్షలు, రూ. 2 లక్షలు, 4,5 స్థానాలకు 75,000 చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు ఐడియా తాన్ వెబ్సైట్లో సంప్రదించాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సత్యవేడు రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన సేన్యార్ తుఫాను ప్రభావంతో కురియనున్న భారీ వర్షాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సత్యవేడు మండల తాసిల్దార్ రాజశేఖర్ అధికారులను అప్రమత్తం చేశారు. తుఫాను తీరందాటే వరకు ప్రతి అధికారి మండల హెడ్ క్వార్టర్ లో ఉండాలని సూచించారు. వరద ప్రభావం ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ తుఫాను షెల్టర్ ఏర్పాటు చేయడానికి ముందస్తు జాగ్రత్త ఉండాలన్నారు. తుఫాను సమయంలో బలమైన గాలులు వీచే ప్రమాదం వున్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలి అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రవత్తంగా ఉండాలన్నారు.


స్విమ్స్‌లో విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అత్యవసర సమయాల్లో గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు సిపిఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్) ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని, విద్యార్థులు అవగాహన పెంచుకొని ఎదుటివారి ప్రాణాలను రక్షించాలని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ తెలిపారు. స్విమ్స్ మెడిసిన్ విభాగం, ఇండియన్ సొసైటి ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ క్యాంపస్ స్కూల్లో సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ సిపిఆర్ గురించి విద్యార్థులకు వివరించారు. మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్. అల్లాడి మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి నైపుణ్యాలను పెంచుకుని బాధ్యత గల పౌరులుగా సమాజానికి ఉపయోగపడాలన్నారు. ఆపదలో ఉన్న వారిని మనకు తెలిసిన పరిజ్ఞానం ద్వారా కాపాడగలిగితే అంతకంటే గొప్ప విషయం ఉండదన్నారు. స్విమ్స్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్. హరికష్ణ సిపిఆర్ ఎలా చేయాలి అనే అంశాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ అలోక్ సమంత రే, ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షాకిన, డాక్టర్ సాయితేజ పాల్గొన్నారు.



సిపిఆర్ ఎలా నేర్చుకోవాలో తెలుసుకుంటున్న విద్యార్థులు



లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర



పంచమి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్‌పి

వైభవంగా లక్ష్మీ కాసుల హారం శోభాయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవారి లక్ష్మీ కాసులహారం శోభాయాత్ర శుక్రవారం తిరుచానూరులో వైభవంగా జరిగింది. ముందుగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మీ కాసులహారాన్ని తిరుచానూరులోని శిల్పారామం పసుపుమండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా మాడ వీధుల గుండా ఆలయానికి తీసుకెళ్లారు.టీటీడీ ఈవో మాట్లాడుతూ శ్రీవారి ఆభరణాలలో లక్ష్మీ కాసులహారం అత్యంత ప్రధానమైందని, పౌర్ణమి గరుడసేవ సందర్భంగా ఈ హారాన్ని శ్రీ మలయప్పస్వామి వారికి అలంకరిస్తామని తెలిపారు. సాక్షాత్తు స్వామివారు ధరించే ఈ హారాన్ని గజవాహనం, గరుడవాహన సేవల సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జేఈఓ వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం సాయంత్రం వసంతోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చల్లదనం కోసం చందనం జలాన్ని మాడ వీధుల్లో భక్తులు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్ , ఆలయ అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

మహా పాదయాత్రగా అమ్మవారికి సారె

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శుక్రవారం శ్రీ పద్మావతి అమ్మవారికి మహా పాదయాత్రగా వచ్చి సారె అందజేశారు. తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పద్మావతి దేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో గజ వాహన సేవకు, ప్రతి ఏటా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం మోహిత్ రెడ్డి సారె అందించారు.

తిరుచానూరు పంచమికి పటిష్ట భద్రత

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా అత్యంత విశిష్టమైన పర్వదినం అయిన పంచమి తీర్థం రోజు భారీగా భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో, అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, అనంతపురం రేంజ్ డీఐజీ షిముషీ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి శుక్రవారం అమ్మవారి పుష్కరిణి, పరిసర ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తుల రద్దీ, భద్రత, క్యూలైన్ నిర్వహణ వంటి అంశాలపై అధికారులు సమగ్ర సమీక్ష చేసి, టీటీడీ ఉన్నత అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఉన్నత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీస్ శాఖలకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

చిన్న పిల్లలు, పెద్దలు తప్పిపోకుండా ఉండేందుకు లాస్ట్ అండ్ ఫౌండ్ కౌంటర్, చైల్డ్ హెల్ప్ డెస్క్ వంటి సేవలను బలోపేతం చేయాలని ఆదేశించారు. పంచమి తీర్థం రోజు భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితంగా పుణ్యస్నానం ఆచరించేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టిందని తెలిపారు. ప్రజలు పోలీసులు ఇచ్చే సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవి మనోహర ఆచారి, డీఎస్పీలు వెంకట్ నారాయణ, ప్రసాద్, గిరిధర్ పాల్గొన్నారు.

గజ, గరుడ వాహనాల్లో అమ్మవారికి విహారం

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచే భారీగా ప్రజలు అర్జీలతో హాజరయ్యారంతో మండల పరిషత్ కార్యాలయం జనంతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, పెన్షన్లు, రహదారులు, విద్యుత్ సమస్యలు, అభివృద్ధి పనుల్లో జాప్యం వంటి అంశాలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులను పిలిపించి సమస్యలపై అక్కడికక్కడే సూచనలు జారీ చేశారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి వినతిని పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమములో మండల ఎంపిడిఒ, ఎంఆర్‌ఒ, చైర్మన్, యంఈఓ, యంపిడిఓ, అన్ని శాఖల అధికారులు, పిఏసిఎస్ అధ్యక్షులు, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అర్జీదారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాగలాపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రద్ధతో పని చేయాలని సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం నాగలాపురం వ్యాపార సంఘం కళ్యాణ మండపంలో యువ నాయకుడు ప్రదీప్ రెడ్డి, మండల టీడీపీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్, ఎంపిపిటి ప్రేమ సెల్వ కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి 197 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సురుటుపల్లి ఆలయ చైర్మన్ పద్మనాభ రాజు, పిచ్చాటూరు సతీష్ నాయుడు, సత్యవేడు చంద్రశేఖర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ నాయుడు, బాలాజీ రెడ్డి, సెల్వ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పీఎం దాష్ బోర్డుకు పంపిస్తున్నామని సంబంధిత అధికారులు సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరు, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల నుండి ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకి తమ సమస్యలు తెలియజేశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వినతులు త్వరిత గతిన పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లాలో మొదట గూడూరులోనే ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ శాఖలో ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.వెంకట ప్రసాద్, ఎంపీడీవో, మధుసూదన్ రావు, కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, గొల్ల కండ్రిగ గ్రామానికి చెందిన 102 సంవత్సరాల వయసున్న వృద్ధురాలు నల్ల కుక్కల రాజమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, గొల్ల కండ్రిగ గ్రామానికి వెళ్లి రాజమ్మ మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టిడిపి రూరల్ అధ్యక్షులు ఆరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు వెంకటేశ్వర్లు రెడ్డి మృతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్. కండ్రిగ మండలం, కంపాక్కం గ్రామానికి చెందిన వైయస్సార్సీపీ సీనియర్ నాయకుడు అంబటి వెంకటేశ్వర్లురెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వైయస్ఆర్సీపీ సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేష్, మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు ఆర్జిఐ విభాగ కార్యదర్శి రవి రెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ హరినాథ రెడ్డి, అజయ్ రెడ్డి, దేవదాసు రెడ్డి, రైతు విభాగ కార్యదర్శి జయచంద్ర నాయుడు, చంద్ర, కిరణ్ యాదవ్, కత్తి శివ, దినకర్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం పరిశీలన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాల పేట మండలం, టిసి అగ్రహారంలో ప్రధాన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకం అమలు తీరును కేంద్ర వ్యవసాయ శాఖ ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకం సీఈవో ముక్తానంద్ అగర్వాల్ పర్యవేక్షించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి పథకం అమలులో కష్టనష్టాలను విచారించారు. రాబోయే సీజన్ నుండి మరింత సులభతరంగా పంటల బీమా పథకాన్ని అమలు పరచడానికి ప్రయత్నిస్తామని తెలియజేశారు. ఈ రబీ సీజన్ నుండి అధిక వర్షాలతో కాని, వరదతో కానీ పంటనష్టం జరిగితే ఆ వివరాలను నమోదు చేస్తే, వాటిని కూడా పరిగణలోకి తీసుకొని నష్టపరిహారం అందేలా పంటల బీమా పథకాన్ని మార్పులు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వ్యవసాయ శాఖ కేంద్ర కార్యాలయం, పంటల బీమా పథకం జేడీ వేణుగోపాల్ తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాదరావు, పుత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ కార్మికులకు శిక్షణ



ప్రజాశక్తి - బాలాయపల్లి: పచ్చదనం, పరిశుభ్రత థీమ్ 5 కార్యక్రమంలో భాగంగా చెత్తతో సంపద తయారీ కేంద్రాల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు ఎంపీడీఓ నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తడి చెత్త, పొడి చెత్త, పారిశుద్ధ్య మెరుగు చేసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్‌కు సమగ్ర చట్టం కల్పించాలి



ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జై చంద్ర హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆటో వర్కర్స్‌కు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల ఇబ్బందులు పాలవుతున్నారని, చట్టం అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చారని ఈ కోడ్లతో కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఆటో కార్మికులపై క్రిమినల్ చట్టాలు మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విధానానికి స్వస్తిపలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, మండల కన్వీనర్ ప్రసాద్, చంద్రగిరి ఆటో వర్కర్స్ యూనియన్ మండల కన్వీనర్ యుగంధర్, సిఐటియు ఆటో వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యులు వి మురళి, బాలాజీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఆనంద్ బాబు, దర్గా ఆటో స్టాండ్ నాయకులు వేణు, పాకాల దామలచెరువు వెంకటేశ్వర ఆటో యూనియన్ నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విమల్ ఎంపిక

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్ కండ్రిగ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విమల్ అనే విద్యార్థి 20వ తేది దుర్గ సముద్రంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాడు. నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెంలో డిసెంబర్ 6,7, 8 వ తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక ఆయ్యాడు. విమల్‌ను ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు నెలవాయి విద్యార్థిని తులసి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బిఎన్ కండ్రిగ మండలం, నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిస్ట్రిక్ లెవెల్ అండర్ 14 వాలీబాల్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన నెలవాయి, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని వి.తులసి స్టేట్ లెవెల్ వాలీబాల్ విభాగానికి ఎంపికైంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, ఎస్.హరిప్రియ పాఠశాల ఉపాధ్యాయులు తులసికి అభినందనలు తెలియజేశారు.

ఊటనీటి సమస్యను పరిష్కరిస్తాం : కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని మాలవ్యాజీ స్కూల్‌లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. బాలాజి కాలనీలోని మాలవ్యాజీ పాఠశాలతో ఊట నీరు, మురుగునీరు రాకుండా చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాలవ్యాజీ స్కూల్‌లో ఊటనీరు, మురుగు నీరు వస్తున్నదని తెలిపారు. నాలుగు సంవత్స రాల క్రితం స్కూల్ దగ్గరలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆఫీస్, ఇతర నివాస భవనాలు, బలిజ భవన్ స్థానంలో పెద్ద ఊట గుంట ఉండేదని తెలిపారు. ఆ స్థలం పూర్తిగా పూడ్చి ఆఫీస్ కట్టడం వల్ల ఆ ప్రదేశంలో ప్రవహించే ఊటనీరు దిశ మార్చి మాలవ్యజీ స్కూల్‌లోని తరగతి గదులలో ఊటగా ఏర్పడుతున్నదని స్కూల్ సిబ్బంది తెలిపారన్నారు. శాశ్వత పరిష్కారానికి మాలవ్యాజీ స్కూల్‌లో కొత్తగా ఎల్‌ఎల్‌డి 8 లైన్ ఏర్పాటుకు 9.90 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశామని, పనులు కూడా ప్రారంభించడం జరిగినదని తెలిపారు. ఈ పనులను 5 రోజులలో పూర్తి చేసి పాఠశాల విద్యార్థులకు అసౌకర్యం లేకుండా పని పూర్తి చేస్తామని తెలిపారు. కమిషనర్ వెంట డి.ఈ. మధు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి సత్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మదనపల్లి వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో పట్టణంలోని ఆక్స్ ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కిరణ్ కుమార్ విజేతగా నిలిచాడు. తద్వారా ఈనెల 23, 24వ తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కరాటే పోటీల్లో సత్తా చాటిన కిరణ్ కుమార్ ను పాఠశాల అధినేత చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి శుక్రవారం అభినందించారు.

చినబాబుకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చినబాబు ఏ.మురళీ మోహన్‌ను ఉపాధ్యాయ మిత్ర బృందంట ఘనంగా సన్మానించారు. శుక్రవారం కమ్మపల్లిలోని చిన్న బాబు స్వగృహంలో ఉపాధ్యాయ మిత్ర బృందం ఆయనను కలిసి దుశ్యాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఎంఎస్ఎంఈ రంగ పురోగతి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ, గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన కృషి చేయగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, డాక్టర్ సుధాకర్ నాయుడు, బట్టా భాస్కర్, సాంబి రెడ్డి, శేషాద్రి, వేణు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవసేనకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగపు పరిశోధక విద్యార్థి ఎస్ ఎమ్ దేవసేనకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు సీఈ రాజా మాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్ర విభాగం ఆచార్య ఆర్ పి. విజయలక్ష్మి పర్యవేక్షణలో రేర్ ఎర్త్ అండ్ ట్రాన్సిషన్ మెటల్ డోపెడ్ జడ్ఎన్ఒ ఫార్ పెట్రో కెమికల్, ఎనర్జీ స్టోరేజ్ అండ్ సెన్సార్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో అనేక పరిశోధనా పత్రాలను సమర్పించారు. ప్రస్తుతం ఈమె శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్‌గా గత 15 సంవత్సరాలు నుంచి ఫిజిక్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. దేవసేనకి పలువురు అభినందనలు తెలిపారు.

పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేసి గ్రామపంచాయతీలను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలని నాయుడుపేట ఎంపీడీవో కె. సురేష్ బాబు సూచించారు. శుక్రవారం నాయుడుపేట మండలంలోని మేనకూరు పంచాయతీలో నిర్వహించిన స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు సమన్వయంగా పనిచేసి మండలంలోని గ్రామపంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామపంచాయతీలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. ఏఎన్ఎంలు, అంగన్వాడీలు, ఆశ వర్కర్లు గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం మెరుగుపరిచి, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డిప్యూటీ ఎండిఓ భువనేశ్వర్ శర్మ, కార్యదర్శులు ఎం.గోపాల్, కె గోవిందయ్య, మేనకూరు సర్పంచ్ కె.సురేష్, ఉపసర్పంచ్ ఏ. సురేష్, పలువురు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ అభివృద్ధికి కృషి చేయండి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఉన్నతాధికారులు కృషి చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ నాయుడు కోరారు. శుక్రవారం వర్సిటీలో నూతన విసి ఆచార్య తాతా నరసింహారావుని, రిజిస్ట్రార్ భూపతి నాయుడుని, నూతన రెక్టర్ అప్పారావుని కలిసి టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ గత గడిచిన ఐదు సంవత్సరాల క్రితం వైకాపా ప్రభుత్వం హాయంలో అధికారులు విశ్వవిద్యాలయాన్ని అనేక రకాలుగా భ్రష్టు పట్టించడం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులను తీసుకురావాలని ప్రయత్నాలు నిర్వహిస్తున్నాడని అన్నారు. ఉన్నత విద్య అభివృద్ధికి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఉండాలని, పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని విసిని కోరారు. విసి స్పందిస్తూ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సహకరిస్తానని, పీజీ స్పాట్ అడ్మిషన్లను నిర్వహించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భీష్మ , బషీర్, ప్రకాష్ ,పెద్దయ్య, రఘు, రాజు, హరికృష్ణ చక్రి,వంశి, వంశీకృష్ణ, రమేష్, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

శివ నాయక్‌కు డాక్టర్ బిరుదు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బెంగళూరు, బాలలత వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త శివా నాయక్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం డాక్టర్ బిరుదు అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో భూక్యా శివ నాయక్ చేసిన సేవలు విశేషమైనవని, ఈ అంకితభావాన్ని గుర్తించి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో డాక్టర్ బిరుదుతో సన్మానం పొందడం గర్వకారణమైన విషయమన్నారు. రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ తీసుకున్న డాక్టర్ శివ నాయక్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి డాక్టర్ ఇవ్వడం ఎంతో ఆనందం కలిగించడమే కాకుండా సమాజంలో గౌరవ మర్యాదలు మరింత పెరిగేలా చేసిందన్నారు.

తుపానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహశీల్దార్ విజయలక్ష్మి



ప్రజాశక్తి - బాలాయపల్లి: సెన్యా తుపాను నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ విజయలక్ష్మి సూచించారు. ఈ నెల 21 నుండి 24 వరకు తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పీఎం స్వానిధి సంకల్ప్ అభియాన్

ప్రజాశక్తి - నాయుడుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిబ్బర్ నిధి-పీఎం స్వానిది, 2.0 రుణాల పురోగతి పై నాయుడుపేట మునిసిపల్ కమీషనర్ ఎస్.కె పజిల్లుల్లా అధ్యక్షతన మెప్మా అధికారుల సమక్షంలో బ్యాంక్ అధికారులు, వీధి వ్యారులతో శుక్రవారం మధ్యాహ్నం మునిసిపాలిటీ కౌన్సిల్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్‌తో పాటు, నాయుడుపేట మునిసిపల్ పరిధిలోని కెనరా బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, మెప్మా సిబ్బంది, పీఎం స్వానిది 2.0 మొదటి, రెండవ, మూడవ విడత రుణాల జారీ, గ్రౌండింగ్ విషయమై బ్యాంకు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ బ్యాంక్ అధికారులు అర్హులైన వ్యాపారులందరికి ఈ నెలాఖరు లోగా పూర్తిగా లోన్స్ మంజూరు చేయాలని, అలాగే మెప్మా సిబ్బంది కూడా వంద శాతం దరఖాస్తులను బ్యాంకులకు పంపించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా 371 మంది వీధి వ్యాపారులకు సంబంధించి అరవై నాలుగు లక్షల ముప్పై మూడు వేల రూపాయలను మునిసిపల్ కమీషనర్, బ్యాంకర్స్ చేతుల మీదుగా మెగా చెక్ రూపంలో అందించటం జరిగింది. ఈ కార్యక్రమం లో మెప్మా సీఎంఎం సురేంద్ర, సిఓలు నారాయణమ్మ, చెంచులత, మెప్మా రీసోర్స్ పర్సన్‌లు, వీధివ్యాపారులు పాల్గొన్నారు.

జలదంకి మధుసూదన్ రెడ్డికి నివాళి

ప్రజాశక్తి - నాయుడుపేట: సీనియర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ జలదంకి మధుసూదన్ రెడ్డికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. జలదంకి మధుసూదన్ రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి నాయుడుపేట పట్టణంలోని మాతృశ్రీ అపార్ట్మెంట్‌లో ఉన్న జలదంకి మధుసూదన్ రెడ్డి నివాసానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, కాపులూరు చక్రపాణి, పలువురు నాయకులు మధుసూదన్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏహెచ్‌లో నవజాత శిశువు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నవజాత శిశువు మృతి చెందిన సంఘటన శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. పట్టణంలోని జానుల్లా వీధికి చెందిన ఓ ముస్లిం మైనారిటీ మహిళను తడకు చెందిన ఓ వ్యక్తికిచ్చి వివాహం చేశారు. ఆమె గర్భం దాల్చడంతో మొదటి కాన్పు నిమిత్తం పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో పురిటి నొప్పులు రావడంతో గురువారం సాయంత్రం బంధువులు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం కాన్పు కష్టంగా మారడంతో వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ చేసి మగ శిశువును బయటకు తీశారు. పుట్టిన కాసేపటికే బిడ్డకు గుండె, శ్వాస సంబంధిత సమస్య రావడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. 108లో తరలించే లోపే బిడ్డ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణారెడ్డిని వివరణ కోరగా సాధారణ ప్రసవం కోసం తాము ప్రయత్నించామనీ, కానీ లోపల బిడ్డ మలాన్ని తినడంతో పరిస్థితి సిజేరియన్ వరకు వెళ్లిందనీ, ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినా కాసేపటికే బిడ్డ మృతి చెందిందని వివరించారు. కాగా ఏరియా ఆసుపత్రిలో నెల రోజుల కిందట ఓ గిరిజన మహిళ మృత శిశువుకు జన్మనిచ్చిన విషయాన్ని మర్చిపోకముందే మరో నవజాత శిశువు మృతి చెందడం గమనార్హం.

కళత్తూరు దళితులకు బాసట

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాయలచెరువు గండి ఘటనలో సర్వం కోల్పోయి, దుర్భర జీవితాలు గడుపుతున్న కేవీబీపురం మండలంలోని కళత్తూరు దళితులకు జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ బాసటగా నిలిచారు. శుక్రవారం తనవంతు సాయంగా నిత్యావసర సరుకులు అందజేశారు. విపత్తు జరిగి 2 వారాలు గడుస్తున్నా ఇంకా ఆపన్నహస్తాల కోసం ఎదురు చూస్తున్నారనీ, దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

రేపు మలయాళ స్వామి కాంస్య విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శ్రీ వ్యాసఆశ్రమం శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సీతారామపురం గ్రామం పరిధి వెంకటగిరి కూడలిలో మహర్షి సద్గురు మలయాళ స్వామి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు శ్రీ వ్యాసాశ్రమం పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు మాజీ శాసన మండలి ప్రోటెం స్పీకర్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం తిరుపతిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్టాపన చేస్తున్నట్లు చెప్పారు.

తిరుపతి అభివృద్ధి జనసేనతోనే సాధ్యం




ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అభివృద్ధి జనసేన పార్టీతోనే సాధ్యమనపి ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ప్రజాశక్తికి తెలిపారు. గత ప్రభుత్వం కంటే ప్రస్తుతం తిరుపతి ప్రశాంత వాతావరణంతో పాటు ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ గెలుపుకు తమ మద్దతుదారులు ఎంతోమంది సహకరించారని వివరించారు. తాను ఒక సామాన్య సామాజిక కార్యకర్త నుండి బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడిగా, మాజీ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా, లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా, రాయలసీమ జిల్లాలోని అన్ని వాకర్స్ అసోసియేషన్ల అధ్యక్షునిగా తన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో పట్టణ ప్రజలకు సేవలందించడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. ప్రతిరోజూ ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహించడం తనకు వ్యసనంగా మారిందని ఆయన తెలిపారు. నెలలో పదిహేనురోజులు వివిధ వాకర్స్ పార్కులలో ఆరోగ్య అవగాహన సదస్సులు మరియు ఉచిత రక్తపరీక్షలను, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 2023లో బిఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, మాజీ ఐఏఎస్ తోట చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా రాజకీయ అరంగేట్రం చేసినట్లు తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో జనసేన అభ్యర్థి అరణి శ్రీనివాసులు ఆహ్వానం మేరకు అరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సమక్షంలో జనసేలో చేరానని తెలిపారు. తిరుపతిలోని 15 వాకర్స్ అసోసియేషన్లను రోజుకు ఒకటి చొప్పున కలుస్తూ నడకతో తన ప్రచారాన్ని ఉధృతం చేసినట్లు తెలిపారు. తిరుపతి ఎన్నికల ప్రచారంలో తన మొదటి అడుగును నడకతోనే ప్రారంభించనన్నారు. కష్టపడిన వారికి పవన్ కళ్యాణ్ గుర్తుపెట్టుకుంటారని, వారిని ఆదరించేది జనసేన పార్టీని అన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఆర్కాట్

తిరుపతి, లీలామహల్ సర్కిల్ వద్ద, రినెస్ట్ హోటల్‌లో ఆర్టీసీ ఉద్యోగుల సమావేశంలో మంగళం డిపో గౌరవ అధ్యక్షులుగా సమాజసేవకులు, జనసేన నేత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్‌గా సేవలందిస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ని ఎన్నుకున్నట్లు ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగసంఘ నాయకులు మాట్లాడుతూ ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను మంగళం డిపో గౌరవ అధ్యక్షులుగా నియమింపపడటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ పదవిని అందించిన ఉద్యోగసంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల శ్రేయస్సుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.మురగమ్మ, జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.మనోజ్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షులు డి.గురునాథం, జిల్లా అధ్యక్షులు జి.ఆర్.చంద్ర, జిల్లా కార్యదర్శి వి.మస్తాన్, జిల్లా సహాయ కార్యదర్శి యం.యస్.రెడ్డి, డిపో సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటేశ్వరబాబు, డిపో ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రేఖ, జే.నరేంద్ర, డిపో నాయకులు బి.రామారావు, జి.ఆర్.బాబు, యన్. భాస్కర్, గోపీనాథ్, సోనీ వెంకటేశ్వర్లు, శేషాద్రి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఈదుల కాలువలో.. పాడి రైతు మృతి



జయరామయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆవులను మేతకు తీసుకెళ్తూ కాలువ దాటే క్రమంలో గల్లంతై ఓ పాడి రైతు మృత్యువాత పడిన దుర్ఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలం, నారాయణపురంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జయరామయ్య (70) ఆవులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఆవులను మేత కోసం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో దారి మధ్యలో ఉన్న ఈదుల కాలువను దాటే క్రమంలో నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. రాత్రి అయినా జయరామయ్య ఇంటికి రాకపోవడంతో కంగారుపడ్డ బంధువులు పలుచోట్ల వెతికి చూశారు. ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో ఈదుల కాలువ వద్ద గాలించారు. ఆవులు గట్టుపై ఉండడంతో జయరామయ్య కాలువలో కొట్టుకుపోయి ఉంటాడని గ్రహించి వెతకడం మొదలుపెట్టారు. అయినా లాభం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు డ్రోన్ల సాయంతో సమీపంలో ఉన్న ఆరవ కొత్తూరు చెరువు సమీపంలో జయరామయ్య మృతదేహాన్ని కనుగొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

అనాథ వృద్ధురాలికి ఆపన్నహస్తం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఉదయం హృదయాన్ని కలిచివేసే ఘటన చోటుచేసుకుంది. వృద్ధురాలిని గుర్తు తెలియని ఆటోలో తీసుకుని వచ్చి బస్టాండులో వదిలి వెళ్లగా, నేలపైనే కదలలేని పరిస్థితిలో ఆమె కనిపించింది. ఆమె కాలి ఎముక విరిగి బయటికి కనిపించే స్థాయిలో తీవ్ర గాయాలతో, లేవలేని దుస్థితిలో ఉండిపోయింది. ఈ దృశ్యాన్ని గమనించిన డిపో మేనేజర్ మహేంద్ర, అసిస్టెంట్ మేనేజర్, మంగమ్మ వెంటనే స్పందించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. వృద్ధురాలికి అత్యవసర చికిత్స చేయించి, కట్టు కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ బాబు వృద్ధురాలి ఫోటోను పలు వాట్సాప్ గ్రూపుల్లో పంపుతూ, ఆమెను సంరక్షించగల ఏదైనా అనాథ ఆశ్రమం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మేము చేయగలిగినంత సహాయం చేసాం, ఇక ఆమెను చూసుకునే మంచి హృదయాలు ముందుకు రావాలని డిపో మేనేజర్ మహేంద్ర కోరారు.

వ్యక్తి ఆత్మహత్య



భాస్కర్ మృత దేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - రామచంద్రపురం: మద్యానికి బానిసైనందుకు కుటుంబ సభ్యులు మందలించడంతో తిరుపతి, కొర్లగుంట మారుతీ నగర్‌కు చెందిన కే.భాస్కర్ (45) రాయల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భాస్కర్ మెడికల్ షాప్ నడిపేవాడని, అతని భార్య కుమారి టైలరింగ్ షాపులో పని చేసుకుని జీవనం సాగించేవారు. వీరి కుమార్తె రమ్యశ్రీ 9వ తరగతి చదువుతోందని తెలిపార. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా భాస్కర్ మద్యానికి బానిసై, తన ద్విచక్ర వాహనాన్ని పోగొట్టుకోవడంతో కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం ఎందుకు ఎక్కువగా మందు తాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటావు, నీకు కొనిచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఎక్కడ పోగొట్టుకున్నావు అని గట్టిగా ప్రశ్నించగా భాస్కర్ మనస్థాపానికి గురై గురువారం సాయంత్రం 6 గంటలకు ఇంటిలో నుండి బయటకు వచ్చేసాడు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకల్లా రాయలచెరువులో దూకి ఆత్మహత్య చేసుకొని శవమై తేలాడు. మత్స్యకారులు చెరువులో చేపల వలలు తీస్తుండగా మృతదేహాన్ని గుర్తించి ఆర్సిపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై భక్తవత్సలం సిబ్బందిని ఘటన స్థలానికి పంపించి పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని శవంగా పరిగణించి మృతుని ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టడంతో భాస్కర్ బంధువులు గుర్తించి, అతని భార్య కుమారికి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు.

ట్రావెల్ బస్సు బోల్తా.. ఆరుగురికి గాయాలు



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి, పెళ్లకూరు మండలం, దొడ్లవారి మిట్ట వద్ద శుక్రవారం తెల్లవారుజామున మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తాపడ్డ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు విజయవాడ నుండి బెంగళూరుకు 21 మంది ప్రయాణి కులతో వెళ్తున్న మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు దొడ్ల వారి మెట్ట వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా పెళ్లకూరు ఎస్సై నాగరాజు సంఘ టన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ ప్రయాణికులు అంబేద్కర్ కోనసీమ జిల్లా, మల్కిపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెళ్లకూరు ఎస్సై నాగరాజు తెలియజేశారు.

బాలిక ఆత్మహత్యాయత్నం



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, నరసింగాపురం ఎస్టీ కాలనీలో 15 ఏళ్ల బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. ఓ యువకుడితో ప్రేమలో ఉందని అనుమానించిన సోదరుడు ఫోన్‌లో దండించడంతో, బాధతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే రూయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అపస్మారక స్థితిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థినులు జూనియర్లకు స్వాగతం పలికారు. సాంప్రదాయ దుస్తుల్లో హాజరై సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. జీవితాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్ అన్నారు. సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా మారాలని సూచించారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వెంకటగిరి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో వైద్య విద్య భారం అవుతుందని వైసిపి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు పందిటి కామరాజు తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెంకటగిరి నియోజకవర్గం, డక్కిలి మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వెంకటగిరి నియోజకవర్గం ఎస్సి, సెల్ అధ్యక్షులు గానుగ వెంకటబాబు (అభిరామ్), వైసిపి అధికార ప్రతినిధి కూనిపోగు, యిర్మీయా, నాయకులు పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - వాకాడు: తుఫాన్ హెచ్చరికల కేంద్రం నుంచి వచ్చిన సమాచారం మేరకు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోలర్ రూమ్ ఏర్పాటు చేయబడిందని తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. వాకాడు మండలంలో భారీ వర్షాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న 08624221024 ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా తహశీల్దార్ కోరారు.

ప్రజాశక్తి -కోట : తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కోట తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ కటారి జయ జయ రావు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సమాచారమివ్వాలని కోరారు. 9989502068, 9701227914 ఫోన్‌లను సంప్రదించాలన్నారు.

కార్తీక వన భోజనాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక భరద్వాజ తీర్థంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు, స్థానికులు, ప్రముఖులు పాల్గొని సహ పంక్తి భోజనాలు చేశారు. మనుషులంతా ఒకటేనని చాటేందుకు వన భోజనాలు దోహదపడతాయని ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ అన్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణములోని స్థానిక. మున్సిపాలిటీ. పరిధిలోని గేట్ పుత్తూరు 9 వ వార్డ్ పారిశుధ్యంపై మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరావు పర్యటించారు, వార్డ్‌లో చెత్త, కాలువల పరిస్థితిని గమనించి, వార్డ్ పరిశుభ్రతకి మున్సిపల్ సిబ్బందిచే అందుబాటులో ఉండేలా చేస్తామని తెలియజేసారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఐదు మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణి చేశారు. తిరుపతి, మధురా నగర్‌కు చెందిన రాకేష్ కుమార్ సతీమణికి 3,26,031 రూపాయల చెక్కును, ఎల్ఐసి రోడ్డుకు చెందిన వి.చందనకు 1,10, 000 రూపాయల చెక్కును, మధురానగర్‌కు చెందిన వెన్నెల రాయల్‌కు 94,094 చెక్కును, లక్ష్మీనగర్ కాలనీకి చెందిన బాదితులకు 84,928 రూపాయల చెక్కును, మధురానగర్‌కు చెందిన వినయ్‌కు 65,230 రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు

చంద్రశేఖర్ రాజుకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్‌బి ఆర్ పురం గ్రామానికి చెందిన, పుత్తూరు శాంతి థియేటర్ యజమాని, వ్యాపారవేత్త చంద్రశేఖర్ రాజు కర్మక్రియల్లో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, చంద్రశేఖర్ రాజు సేవలను స్మరించుకున్నారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల (మినీ గురుకులం)లో శ్రీ కృష్ణ సేవా సమితి దాతృత్వంతో న్యూ మోడరన్ ఐ కేర్ రాజశేఖర్, బాలాజీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ జ్యోతిర్మయి వారి సౌజన్యంతో శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ తల్లి దివంగత బండి వనమ్మ 4వ వర్ధంతి పురస్కరించుకొని మినీ గురుకులం విద్యార్థునులకు కంటి పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ధ్యానం క్రమం తప్పకుండా పాటించి, ఆరోగ్యంగా ఉండి బాగా చదివి ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్, రాజశేఖర్, డాక్టర్ కిరణ్మయి, అంకమ్మ, లావణ్య, పి.ఈ.టి నాగూరమ్మ, ఏఎన్ఎం రమణమ్మ, రాజేశ్వరి విద్యార్థునులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం పరిధిలోని కొండగుంట పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా సి.డి.పి.ఓ మోహబూబి ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 వ తేదీ నుంచి 21 వ తేదీ వరకూ బాలల దినోత్సవం భాగంగా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

పోరు బాటను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ విద్య పరిరక్షణకై విద్యార్థి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన చేపట్టనున్న పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి కుమార్, జిల్లా కార్యదర్శి సి ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శి కోగిలి.మునిచందు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అధికారంలోకి వస్తే నెల రోజుల్లో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్, ఒకటిన్నర సంవత్సరం దాటిపోతున్నా ఆ ఊసే లేదని మండిపడ్డారు. మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని వాపోయారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలువురు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీ మహిళల కోటా రిజర్వేషన్ ప్రకటించాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): దేశవ్యాప్తంగా కుల జనగణనతో పాటుగా కుల గణన చేసి ఓబీసీ మహిళా కోటా రిజర్వేషన్‌ను ప్రకటించి అమలు చేయాలని ఏపీ బీసీ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బీసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్ర ప్రభుత్వం ఓబీసీ మహిళా కోటా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. ఓబీసీ మహిళా రిజర్వేషన్ కోటా సాధనకై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న తిరుపతి పాత మునిసిపల్ కార్యాలయం వద్ద ఒక్కరోజు నిరసన దీక్షను చేపట్టనున్నమని, ఈ దీక్షను జయప్రదం చేయడానికి బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మా భూమిని ఆక్రమించేశారు: అరుణ కుమారి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): కర్నూలు జిల్లా, మద్దికేర మండలంలో ఉన్న తమ భూమిని వైసిపి నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, ఏ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని తమ భూ సమస్యను ప్రభుత్వమే కాపాడి స్వాధీన పరచాలని తిరుపతి నగరానికి చెందిన అరుణ్ కుమారి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కర్నూలు మద్దికేర మండలం గురుజుల గ్రామ రెవిన్యూ పరిధి సర్వేనెంబర్ 402/2 లో తన భర్త చెన్నకేశవులు పేరు పై మూడున్నర ఎకరాల స్థలం ఉండేదని, ఆయన మరణానంతరం భూమి పేరును తన పైకి మార్చుకున్నానని చెప్పారు. తన పేరు పై పాస్ పుస్తకాలలో పేరును మార్పు చేసుకోవడానికి ఆన్లైన్ నమోదు కోసం వెళితే రెవెన్యూ అధికారులు అడ్డు చెప్పి దౌర్జన్యంగా వెళ్లిపోవాలని సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఊరికి వెళ్లి భూమిని కాపాడుకోలేక నిస్సహాయురాలుగా మిగిలిపోతున్నానని, తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, తూపిలిపాలెం సముద్రం ఒడ్డున మత్స్యకారులు ప్రతి సంవత్సరం నవంబర్ 21 న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. శుక్రవారం ఎంపీడీవో సాయిప్రసాద్, ఎమ్మార్వో సయ్యద్ ఇక్బాల్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మత్స్యకారులకు గుర్తింపును అందించడం కోసం, మత్స్య పరిశ్రమకు భవిష్యత్తు ఉండాలనే ఆకాంక్షతో ఆరోగ్యకరమైన సముద్ర పర్యావరణ వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియపరచడానికి దేశమంతటా మత్స్యకార సంఘాలు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తాయి. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా ఎంపీడీవో, ఎమ్మార్వోలు గ్రామస్తుల మధ్యన కేకును కట్ చేసి అందరికీ తినిపించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసి, పూజలు చేయించి, వాటిని తీసుకెళ్లి సముద్రంలో కలిపారు.

రూ. రెండు లక్షలు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మండల పరిధిలోని కొమ్మినేనిపల్లిలో వేలూరు యుగంధర్ ఇటీవల ప్రమాదశాత్తు మృతి చెందాడు. ఇతని గురించి బ్యాంక్‌లో విచారించగా పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివైలు రెండు యాక్టివ్‌లో ఉన్నాయని కెనరా బ్యాంక్ మేనేజర్ తెలిపారు. రెండింటికి బ్యాంకులో క్లెయిమ్ చేయగా, పీఎంజెజెబివై ద్వారా 2 లక్షలు రూపాయలు అతని భార్య వేలూరు లక్ష్మీకి అందజేశామని బ్యాంకు మేనేజర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పిఎంజెజెబివై, పీఎంఎస్బివై అందరూ చేసుకోవాలని, ఆపత్కాలంలో ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ శివ ప్రసాద్, సూళ్లూరుపేట వెలుగు ఏపీఎం ప్రసన్న కుమారి, సీసీ సుధాకర్, సూళ్లూరుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ మునిచంద్ర, పరమానందం, వివోఏ.మల్లెమ్మ పాల్గొన్నారు.

ఘనంగా నల్లపరెడ్డి వినోద్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో మాజీ ఎంపిపి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలును శుక్రవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. అన్నీ పంచాయతీలు నుండి టీడీపీ నాయకులు, నల్లపరెడ్డి అభిమానులు భారీగా తరలివచ్చి వినోద్ కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్బంగా పేదలకు దుప్పట్లు కుటుంబ సభ్యులు చేతులుమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు

ప్రజాశక్తి -కోట : ఇటీవలన మొంతా తుఫాను నేపథ్యంలో సేవలందించిన కోట తాహశీల్దార్‌కు సీఎం చేతుల మీదగా అవార్డు రావడంతో శుక్రవారం కోట మండల పరిధిలోని రేషన్ డీలర్లు తహశీల్దార్ కటారి జయ జయరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలు, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం రేషన్ డీలర్లు మాట్లాడుతూ తాహసిల్దార్ కటారి జయ జయ రావుకు అవార్డు రావడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు.

స్టైఫండ్స్ విడుదల చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఇంటర్న్షిప్, పీజీ, పీహెచ్‌డి పశువైద్య విద్యార్థుల స్టైపెండ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. ఉప్పర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు మాట్లాడుతూ, స్టైపెండ్ బకాయిలను విడుదల చేయకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ ప్రొఫెసర్ వైకుంఠరావు మాట్లాడుతూ, మంగళవారం సాయంత్రంలోగా స్టైపెండ్ బకాయిలను విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలం, గూడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ కోట ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు చైల్డ్ రైట్స్ పై ఎస్‌ఏ రైటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వన్ స్టాప్ సెంటర్ మల్టీ పర్పస్ స్టాఫ్ నగ్మా, కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి ముని కుమారి, సూపర్వైజర్ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ కార్యక్రమాల ద్వారా 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఉండే ప్రాథమిక, మానవ హక్కులు గురించి వారికి వివరించడం జరుగుతుందన్నారు. ఈ హక్కుల ద్వారా పిల్లలు ఆరోగ్యకరమైన జీవితం గడపడం, విద్యను పొందడం, వంటి వాటితో పాటు దుర్వినియోగం, దోపిడీ, హింస నుండి రక్షణ పొందడం వంటి వాటిని ఎదుర్కోగలుగుతారని, ఆ దిశగా పిల్లలు అవగాహన కలిగివుండాలని సూచించారు. అనంతరం చైల్డ్ రైట్స్‌పై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బోధన, పరిశోధనలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆచార్య నర్సింగరావు మొదటిసారి విశ్వవిద్యాలయంలోని శాశ్వత ఆచార్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులు వుంటేనే విశ్వవిద్యాలయం వుంటుందని, వారికి చక్కని బోధన అందించి, పరిశోధన చేయించవలసిన బాధ్యత ప్రతి ఆచార్యునిపై వుందని పేర్కొన్నారు. తాను కొన్ని విభాగాలు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేశానని, ఇంకా తనిఖీల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ర్యాంకుల పరంగా ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల పరీక్షల ఫలితాలను వీలైనంత త్వరలో ఇవ్వాలని, రాబోయే సెమిస్టర్ల నుంచి పరీక్ష ఫలితాలు వేగంగా వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, డీన్ చంద్రాయుడు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

హోటళ్లలో అరటి ఆకులు వాడండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్ కండ్రిగ మెయిన్ రోడ్డులోని హోటళ్లలో వినియోగదారులకు అరటి ఆకులలో భోజనంఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ కార్యాలయం రిసోర్స్ ఇంచార్జ్ షణ్ముగం హోటల్ యజమానులకు సూచించారు. కేన్సర్‌కు కారణమవుతున్న పేపర్ ప్లేట్ల వాడకం మానేయాల్సిందిగా ఎంపీడీవో సుబ్బరత్నమ్మ తెలియజేశారు. అమెరికాలో ఉంటున్న స్థానిక వాసి వై.తులసీరామ్ ప్రతి హోటల్‌కి కొన్ని అరిటాకులను అందిస్తూ, ఆరోగ్యంతో కూడిన ఆహారాన్ని వినియోగదారులకి అందించమని కోరారు. అదే విధంగా టీ, కాఫీ షాపుల్లో కూడా ప్లాస్టిక్ కప్పులు కాకుండా గాజు గ్లాసుల్లో టీ, కాఫీలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువత ఎం.జయచంద్ర, గోపి, హోటల్ యజమానులు, వినియోగదారులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా అందించాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఇంటి రుచులతో, ఆరోగ్యకరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న నదితీరం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల వంటశాలను, మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు తాజా పదార్థాలతో, రుచిగా భోజనం అందించాలని ఆదేశించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా శిక్షణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిక: పిల్లలు విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రమణయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ వారు, పిఎం శ్రీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా శిక్షణ అందించడానికి 2024-25 విద్యా సంవత్సరం నుండి సంవత్సరానికి 50 వేల రూపాయలు చొప్పున నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ నిధుల నుండి 30 వేల రూపాయలతో యూనిఫామ్ కొనుగోలు, 2000 రూపాయలతో పాఠశాల సూచిక బోర్డు ఏర్పాటు, 8000 రూపాయలతో స్కౌట్ మాస్టర్ గైడ్ కెప్టెన్లకి ట్రైనింగ్ పదివేల రూపాయలు స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల శిక్షణ కొరకు కేటాయించారని తెలిపారు. జిల్లా ఇంచార్జ్ కార్యదర్శి జి విజయకుమార్ మాట్లాడుతూ పీఎం శ్రీ నిధుల ద్వారా స్కౌట్ అండ్ గైడ్స్‌కు మహర్దశ వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ జయశ్రీ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భోజనంపై ఎమ్మెల్యే ప్రశంస

ప్రజాశక్తి - వెంకటగిరి టాన్: పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన వెంకటగిరి అన్న క్యాంటీన్‌లో భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పేదల కడుపుని నింపే ఈ పథకాన్ని గత పాలకులు రద్దు చేవారని అందుకే 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి కేవలం 11 సీట్లు ఇచ్చి చూపించారుని ఎద్దేవా చేశారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పాలనను కొనసాగిస్తూ మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే రామకృష్ణ స్పష్టం చేశారు.

ఎస్ఏ -1 పరీక్షల పరిశీలన

ప్రజశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అక్షరా పబ్లిక్ ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఎస్.ఏ -1 చివరి రోజు పరీక్షలను శుక్రవారం విద్యాశాఖ అధికారిలు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యంలు పర్యవేక్షించారు. పరీక్షా విధానం, ప్రశ్నాపత్రాల పంపిణీ, పర్యవేక్షణా వ్యవస్థ, పరీక్షా కేంద్రంలోని సదుపాయాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల మీద శ్రద్ధ వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ప్రతాప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని మంగళ పూరులో శుక్రవారం థీమ్ 5క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం ఎస్. డబ్ల్యూ.పి.సి షెడ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామస్తులకు తడి, పొడి చెత్త పై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందికి తడి, పొడి చెత్త సేకరణపై శిక్షణ నిర్వహించారు.